ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 21 ఏప్రిల్ 2025


క్యూలో భక్తులతో మాట్లాడుతున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి


అఖిలాండం వద్ద..




సర్వ దర్శన క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

'కొండ'ంత భక్తజనం

వరుసగా మూడు రోజుల సెలవులు. ఇంటర్ పరీక్షల ఫలితాలు వెల్లడి కావడం.. ఈ క్రమంలో తిరుమలలో నెలకొన్న రద్దీ ఆదివారమూ కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు సర్వదర్శన భక్తులకు శ్రీవారి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. కాగా, ఆదివారం రాత్రి సర్వదర్శన క్యూలైన్లను అదనపు ఈవో వెంకయ్య చౌదరి పరిశీలించారు. టీబీసీ, ఏటీసీ వద్ద క్యూలైన్లలో భక్తులకు చేసిన ఏర్పాట్లను చూశారు. మొబైల్ ఫుడ్ వెహికల్స్‌ను పరిశీలించి భక్తులకు ఇబ్బంది లేకుండా అన్నప్రసాదాలను అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నూతనంగా ప్రారంభించిన మొబైల్ ఫుడ్ వెహికల్స్ ద్వారా భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తున్నామన్నారు. సర్వదర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం, స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు కలిగిన భక్తులకు ప్రణాళికబద్ధంగా సమన్వయంతో దర్శనాలు కల్పిస్తున్నామని తెలిపారు. శ్రీవారి దర్శన టోకెన్లు, టికెట్లు కలిగిన భక్తులు నిర్దేశిత సమయంలోనే క్యూలైన్‌లోకి ప్రవేశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఈవో రాజేంద్ర, వీజీవో సురేంద్ర, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి


గదుల కోసం సీఆర్వో వద్ద భక్తుల రద్దీ


ఆశల మెగా డీఎస్సీ
వచ్చేసింది..!

- విడుదలైన నోటిఫికేషన్
- రోస్టర్‌తో పోస్టుల్లో స్పష్టత
- జూన్, జూలైలో పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చేసింది. అధికారంలోకి వస్తే తాము మెగా డీఎస్సీ ప్రకటిస్తామని ఇచ్చిన హామీని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నిలబెట్టుకుంది. ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ఏడాదిలోనే నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వం భావించినా, ఎస్సీ వర్గీకరణ అడ్డురావడంతో కొంత సమయం పట్టింది. అయినా, గత ఏడాది టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్) నిర్వహించి.. నవంబరులోనే ఫలితాలు విడుదల చేసింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణకు జైకొట్టిన ప్రభుత్వం డీఎస్సీకి సై చెప్పింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లోని మొత్తం ఖాళీలు.. 1478 భర్తీ చేయనున్నారు. వీటిల్లో.. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ, వ్యాయామ) 1,473 పోస్టులుండగా, ట్రైబల్ వెల్ఫేర్ (ఆశ్రమ) పాఠశాలల్లో మరో ఐదు పోస్టులు (మ్యాథ్స్ 1, ఫిజిక్స్ 1, బయాలజీ 1, ఎస్జీటీ 2) ఉన్నాయి.

షెడ్యూల్ ఇలా..

ఆదివారం నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ, ఫీజు చెల్లింపు ఉంటుంది. మే 20 నుంచి ఆన్‌లైన్ మాక్ టెస్టు అందుబాటులో ఉంటుంది. మే 30వ తేదీనుంచి ఆన్‌లైన్‌లో డీఎస్సీ అభ్యర్థులు పరీక్షల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 6 నుంచి జూలై 6వ తేదీ వరకు సబ్జెక్టుల వారీగా మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి పరీక్ష అనంతరం రెండ్రోజుల్లో 'కీ'ని విడుదల చేస్తారు. ఏడు రోజుల అనంతరం ఫైనల్ 'కీ' విడుదలవుతుంది. ఆ తర్వాత ఏడు రోజులకు డీఎస్సీ మెరిట్ (మార్క్స్ మెమో)విడుదల చేయనున్నారు.



రోస్టర్ వారీగా పోస్టుల వివరాలిలా..

కేటగిరీ	ప్రభుత్వ స్థానిక యాజమాన్యం	మున్సిపల్	మున్సిపల్ కార్పొరేషన్	మొత్తం
ఓసీ	511	26	41	578
బీసీ-ఏ	94	6	11	111
బీసీ-బీ	127	5	7	139
బీసీ-సీ	18	1	0	19
బీసీ-డీ	91	5	6	102
బీసీ-ఈ	48	2	3	53
ఎస్సీ-గ్రేడ్ 1	16	1	4	21
ఎస్సీ-గ్రేడ్ 2	84	4	6	94
ఎస్సీ-గ్రేడ్ 3	102	4	6	112
ఎస్టీ	85	5	5	95
ఈడబ్ల్యూఎస్	125	5	8	138
పీహెచ్-విజువల్	1	0	0	1
పీహెచ్-హియర్	10	0	0	10
ట్రైబల్ వెల్ఫేర్ (ఆశ్రమ)	5	0	0	5
	1317	64	97	1478

నిబంధనలకు విరుద్ధంగా
నగదు బదిలీ

- రేణిగుంట ఏపీఎంకు షోకాజ్

రేణిగుంట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రేణిగుంట అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్(ఎంఎస్ కోఆర్డినేషన్)గా విధులు నిర్వహిస్తున్న పళని కుమార్‌కు డీఆర్‌డీఏ జిల్లా అధికారి శ్రీనివాస్ ప్రసాద్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఏర్పేడు ఏపీఎంగా ఉన్నప్పుడు 1, 2 గ్రామ సంఘాల్లో జమ చేయాల్సిన ఆసరా నిధిని బయట వ్యక్తుల ఖాతాకు బదిలీ చేశారు. గ్రామ సంఘాల నిధుల నుంచి అదనంగా వీవోఏలకు గౌరవ వేతనం చెల్లించడం, కొన్ని సంఘాల్లో వీవోఏలు లేకపోయినా గౌరవవేతనం ఇవ్వడం, సంఘాల నుంచి రుణాలు వసూలు కాకుండానే శ్రీనిధి, ఎస్‌వీఈపీ రుణాలకు గ్రామ సంఘం నుంచి బదిలీ చేసినట్టు ఫిర్యాదులందాయి. ఇలా రూ.26,70,648 బదిలీ చేయడంపై విచారణ చేపట్టిన అధికారులు డీఆర్‌డీఏ అధికారికి నివేదిక పంపారు. ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని పళనికుమార్‌కు షోకాజు నోటీసులు జారీ చేశారు.

క్రమశిక్షణ గల విద్యార్థి..
దార్శనికత గల నాయకుడు


తిరుమలలో కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నాయకులు


అలిపిరి గోశాలలో శ్రీకృష్ణుడికి టీడీపీ నేతల పూజలు

- సీఎం చంద్రబాబు నాయుడు 75వ పుట్టిన రోజు వేడుకల్లో వక్తలు
- చదువుకున్న ఎస్వీ యూనివర్సిటీలో చంద్రబాబుకు విశిష్ట గౌరవం



ఎస్వీయూ సెనేట్ హాలులో కేక్ కట్ చేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు, పూర్వ విద్యార్థులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ గల విద్యార్థి.. దార్శనికత గల నాయకుడిగా ఎదిగారని చంద్రబాబు నాయుడును ఆయన 75వ పుట్టినరోజు సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం భారీ కేక్ కట్ చేసి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సభాధ్యక్షత వహించిన శాప్ ఛైరన్ రవినాయుడు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడి జీవితం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచీ ఎదిగిన ఆయన ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతోనే చంద్రబాబు నాయుడు ఈ స్థాయికి వచ్చారని చెప్పారు. చంద్రబాబు నాయుడికి స్కూల్, కాలేజ్, యూనివర్సిటీ దశల్లో స్నేహితులుగా, సన్నిహితంగా మెలిగిన అనేకమంది ఈ సభలో తమ జ్ఞాపకాలను, అనుభవాలను పంచున్నారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం తరపున పాకనాటి హరికృష్ణ, పత్తిపాటి వివేక్, శేషాద్రి నాయుడు, రాంబాబు నాయుడు, భువనేష్ చౌదరి, మురళీ మోహన్, డాక్టర్ దూపాటి ఉదయ్‌కుమార్, చంద్రప్రకాష్, అంజన్‌సింగ్, రంగనాథ్, ఆనంద్‌గౌడ్, రామ్మోహన్, ఆర్కే నాయుడు, మహేష్‌యాదవ్, ఉదయభాస్కర్, ఎస్ఎంఆర్ ఉద్యోగ సంఘం నేత జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన 'ఆంధ్రజ్యోతి- ఐఆర్ఎంఎస్'
ఎడ్యుకేషన్ ఎక్స్‌పో

- వందలాదిగా తరలివచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు

తిరుపతి(విద్య/రూరల్), ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): తిరుపతినగరంలో ఆంధ్రజ్యోతి- ఐఆర్ఎంఎస్ (ఇంటిగ్రేటెడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్) సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఎడ్యుకేషన్ ఎక్స్‌పో ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ తర్వాత ఏ కోర్సు చేయాలనే సందిగ్ధంలో ఉన్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈఎక్స్‌పోను సందర్శించి.. ఆయా విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్న కోర్సులు, కోర్సుల వ్యవధి, వాటి ఫీజులు వంటి వివరాలను తెలుసుకున్నారు. విదేశీవిద్యకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రముఖ విద్యాసంస్థల స్టాళ్ల సహాయకులతో నేరుగా మాట్లాడి సవివరంగా తెలుసుకున్నారు. దక్షిణ భారతదేశంలో ప్రతిష్ఠాత్మక 30 విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, కన్సల్టెన్సీ ఏజన్సీలు హాజరవగా..నగరంలోని పలు విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్ కోర్సులు చదువుతున్న వందలాదిమంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు సందర్శించారు.



అపూర్వ స్పందన

జిల్లాతోపాటు నగరంలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తల రాకతో ఎక్స్‌పోకు అపూర్వ స్పందన లభించింది. ఏకకాలంలో దక్షిణ భారతదేశంలోని ఇన్ని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకొచ్చి సమగ్ర విద్యా సమాచారాన్ని అందించిన ఆంధ్రజ్యోతి-ఐఆర్ఎంఎస్ ఎక్స్‌పోకు విశేష ఆదరణ లభించింది. ఎక్స్‌పోను సందర్శించే వారికోసం ఇంటిగ్రేటెడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్(ఐఆర్ఎంఎస్)ఫౌండర్ అండ్ సీఈవో రాజ.సి, టర్న్‌కీ ఈవెంట్స్ ఫౌండర్ అండ్ సీఈవో రాధాక్రిష్ణన్ టీకే నేతృత్వంలో అన్ని ఏర్పాట్లను చేశారు. ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్(ఐఆర్ఎంఎస్)ఫౌండర్ అండ్ సీఈవో రాజ.సి, టర్న్‌కీ ఈవెంట్స్ ఫౌండర్ అండ్ సీఈవో రాధాక్రిష్ణన్ టీకేకు ఆంధ్రజ్యోతి యాజమాన్యం తరపున తిరుపతి బ్రాంచ్ మేనేజర్ సురేష్‌రెడ్డి జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

ఆంధ్రజ్యోతి- ఐఆర్ఎంఎస్ ఎడ్యుకేషన్ ఎక్స్‌పోకు

అనూహ్య స్పందన



తిరుపతి(విద్య/రూరల్), ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం పీఎల్ఆర్ కన్వెన్షన్ హాలులో రెండురోజులపాటు నిర్వహించిన ఎడ్యుకేషన్ ఎక్స్‌పోకు అనూహ్య స్పందన లభించింది. పిల్లలతో వచ్చిన తల్లులు, తండ్రులు కొందరైతే.. స్నేహితులతో వచ్చిన విద్యార్థులు మరికొందరు .. కొన్ని కళాశాలల అధ్యాపకులూ తమ విద్యార్థులను ఎక్స్‌పోకు తీసుకొచ్చారు. దీంత పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్ విద్యార్థులు, పెద్దలతో నిండిపోయింది. తమకు కావాల్సిన కోర్సులు అందించే విద్యాసంస్థలకు చెందిన స్టాళ్లకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, ఎక్కడో దూరానవున్న అవకాశాలన్నింటినీ పోగుచేసి విద్యార్థులకు అందించిన ఆంధ్రజ్యోతి-ఐఆర్ఎంఎస్ ఎక్స్‌పోకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎక్స్‌పోలో పాల్గొన్న సంస్థలు ఇవీ: రెండు రోజుల ఎడ్యుకేషన్ ఎక్స్‌పోకు రాజలక్ష్మి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ స్పాన్సర్‌గా, ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(రామాపురం)కో స్పాన్సర్‌గా వ్యవహరించారు. వీటితో పాటు ఐఐటీ మద్రాసు, ఆకాశ్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, ఆచార్య, అనురాగ్ యూనివర్శిటీ, వేల్స్, బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్శిటీ, మార్వాడీ యూనివర్శిటీ, చెట్టినాడ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సీఎంఆర్ యూనివర్శిటీ, జీఆర్టీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, కింగ్స్ కార్నర్ స్టోన్ ఇంటర్నేషనల్ కాలేజ్, ఎన్ఐటీటీఈ డీమ్డ్ టుబి యూనివర్శిటీ, యూనివర్సిటీ ఆఫ్ పీస్, మెడికో అబ్రాడ్ కన్సల్టెంట్స్, ప్రెసిడెన్సీ యూనివర్సిటీ, శ్రీనివాస అకాడమీ, భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, ఆర్ అకాడమీ, అమిటీ గ్లోబల్ బిజినెస్ స్కూల్, అపోలో యూనివర్శిటీ ఈ ఎక్స్‌పోలో పాల్గొన్నాయి.

నా కుమార్తెలకు అవగాహన వచ్చింది



నా ఇద్దరు కుమార్తెలు ఎంబైపీసీ పూర్తి చేశారు. వీరిని ఎంబీబీఎస్‌లో చేర్పించాలి. దీనికి అనువుగా ఏ ఇన్‌స్టిట్యూట్స్ అందుబాటులో ఉన్నాయో తెలుసుకునేందుకు వచ్చా. అవసరమైన సమాచారం లభించింది. నా కుమార్తెలకూ మంచి అవగాహన వచ్చింది.

-పెరియస్వామి, పిచ్చాటూరు



ఇంజనీరింగ్ కళాశాల ఎంపిక కోసం

నా కుమారుడిని మంచి ఇంజనీరింగ్ కళాశాలలో చేర్పించేందుకు అన్వేషిస్తున్నా. ఈలోపు ఆంధ్రజ్యోతి ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహిస్తుందని తెలుసుకుని వచ్చా. మంచి సమాచారం లభించింది.

- కవిత, తిరుపతి



సందిగ్ధంలోంచి బయటపడ్డాం

ఇంజనీరింగ్‌కు ఏ విద్యాసంస్థల్లో చేరాలనే దానిపై మేము సందిగ్ధంలో ఉన్నాం. ఇక్కడికి వచ్చిన తర్వాత కళాశాలల ఎంపికపై మంచి అవగాహన వచ్చింది. మాలాంటి వారికి ఇలాంటి ఎక్స్‌పోలు ఎంతో అవసరం.

- విద్యార్థులు ప్రణీత్, ధనుష్, సోనీహాల్

వ్యయ ప్రయాసలు తగ్గాయి

నా కుమారుడిని మంచి ఇంజనీరింగ్ కాలేజీలో చేర్పించడానికి తెలిసిన వారందరినీ అడుగుతున్నాం. ఒక ఒకే వేదికపై పేరొందిన విద్యాసంస్థలను తీసుకొచ్చి మంచి సమాచారం అందించారు. వ్యయ ప్రయాసలు తగ్గాయి. విద్యాసంస్థల సహాయకులతో నేరుగా మాట్లాడి ఫీజులు, హాస్టళ్ల వంటి సమాచారాన్ని తీసుకున్నాం.

- పార్వతి, తిరుపతి



సాయంత్రం 6 నుంచి వేకువజాము వరకు

రోడ్లపై కేకులు కట్ చేస్తే కేసులే

- బాణసంచా కాల్చకూడదు
- తిరుపతిలో రెండు కేసుల నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సాయంత్రం 6 గంటల నుంచి వేకువజామున మూడు గంటల వరకు.. ప్రజలకు ఇబ్బంది కలిగేలా బాణసంచా కాల్చినా, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా రోడ్లపై కేక్‌లు కట్ చేసినా పోలీసులు కేసులు నమోదు చేయనున్నారు. దీనికి సంబంధించి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతి సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా తిరుపతిలో డీఎస్పీ భక్తవత్సలం ప్రత్యేక చొరవ తీసుకుని ఈస్ట్, యూనివర్శిటీ పరిధిలో రెండు కేసులు నమోదు చేయించారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో ఈ కేసులు నమోదయ్యాయి. ఆదివారం నుంచి తిరుపతిలోని మధురానగర్, ఇర్లానగర్, బైరాగిపట్టెడ, ఎస్టీవీనగర్, శివజ్యోతినగర్, సత్యనారాయణపురం, రైల్వే కాలనీ, ఉపాధ్యాయనగర్ తదితర ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలున్నట్లు గుర్తించిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒకటికి రెండు సార్లు చెప్పినా మాట వినకుంటే కేసులు నమోదు చేయనున్నారు. ప్రతి రోజూ ఎన్ని కేసులు నమోదు చేస్తున్నారు? ఎంతమంది నిఘా వుంచారు అనే వివరాలు ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రానికి పంపాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.



భవానీ నగర్ ప్రాంతంలో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

పలు చోట్ల కౌన్సెలింగ్

తిరుపతిలో అనవసరంగా రోడ్లపైకి వచ్చి టపాకాయలు పేల్చడం, కేక్‌లు కట్ చేయడం వంటి పనులకు పాల్పడి జైలు పాలు కావద్దంటూ ఈస్ట్ సీఐ రామకష్ణ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. భవానీ నగర్ ప్రాంతంలో ఈవ్ టీజింగ్, రోడ్లపై జులాయిగా తిరగడం, అమ్మాయిలను వేధించడం, బైక్ రేసింగ్‌లు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్లపై అనవసరంగా కనిపిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. కొర్లగుంటలోనూ సీఐ రామకృష్ణ, ఎస్ఐ బాలకృష్ణ కౌన్సెలింగ్ ఇచ్చారు.

మే 8, 9 తేదీల్లో

తుడా టవర్స్ కమర్షియల్ గదుల వేలం

తిరుపతి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) నిర్మిస్తున్న తుడా టవర్స్ వాణిజ్య గదుల విక్రయాన్ని మే 8, 9 తేదీల్లో ఈ-వేలం నిర్వహించనున్నట్లు వీసీ ఎస్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య కూడలి వద్ద 3.69 ఎకరాల్లో జీ+13 అంతస్తులతో తుడా టవర్స్ నిర్మిస్తున్న విషయం విదితమే. నివాసయోగ్యమైన గదులకు వేలం నిర్వహించామని తెలిపారు. తుడ టవర్స్ గ్రౌండ్ ఫ్లోర్ (10 గదులు), మొదటి అంతస్తు (21 గదులు)లోని వాణిజ్య గదులను మే 8,9 తేదీలలో ఈ- వేలం ద్వారా విక్రయించేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. వాణిజ్యపు గదులు 2 వేల నుంచి 9వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో నగర వాణిజ్య సముదాయాలకు అత్యంత అనువైనదిగా నిర్మిస్తున్నామని తెలిపారు. ఇతర వివరాలకు తుడా కార్యాలయంలో లేదా తుడ టవర్స్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

విద్యుత్ అదనపు లోడ్డు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఈ ఆంజనేయులు కోరారు. ఇంటి సర్వీసు తీసుకుంటున్న సమయంలో దరఖాస్తులో అంగీకరించిన లోడ్ కంటే ఎక్కువ వినియోగిస్తున్న వారికోసం ఈ సౌలభ్యం కల్పించినట్లు తెలిపారు. జూన్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) 50 శాతం రాయితీ కల్పిస్తుందని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో కంచి పీఠాధిపతి



తిరుమల, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆదివారం రాత్రి నైవేద్య విరామ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించారు. వెలుపలకు వచ్చిన విజయేంద్ర సరస్వతి పుష్కరిణిని సందర్శించారు.

అమ్మవారిని దర్శించుకున్న జస్టిస్ ఎన్వీ రమణ



తిరుచానూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కుటుంబ సమేతంగా ఆదివారం సాయంత్రం తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం సన్నిధిలో అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారికి వేదాశీర్వచనం ఇచ్చి అమ్మవారి శేషవస్త్రంతో బహూకరించారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



పాకాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చ్, సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చిలో తెల్లవారుజామున, ఉదయం ప్రత్యేక ప్రార్థనలు ఆరాధన చేశారు. ప్రభువు చూపిన మార్గంలో జీవించాలని బోధకులు బోధించారు. కేకులు పంచిపెట్టారు. ఆర్‌సీఎం ఫాదర్ ఆంతోనిరాజ్, సీఎస్ఐ పాస్టర్ ప్రేమ్‌కుమార్, కార్యదర్శి విక్టర్ ఎం.రాఘవేలు, ట్రెజరర్ అరుళ్ సెల్వి పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లు ఇవ్వకపోవడంపై కోర్టులో రిట్

తిరుపతిరూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో నిర్మించుకున్న ఇళ్లకు విద్యుత్ మీటర్లు ఇవ్వకపోవడంపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామని సర్పంచ్ సుబ్బరామిరెడ్డి, ఎంపీటీసీ బుజ్జమ్మ తెలిపారు. గత ప్రభుత్వంలో పంచాయతీ ఇచ్చిన ఎన్ఓసీలు, ప్రస్తుతం పంచాయతీకి చెల్లించిన పన్నుల వివరాలను సమర్పించామని పేర్కొన్నారు. విద్యుత్ మీటర్ల కోసం కొందరు డబ్బులు చెల్లించి రశీదులు తీసుకున్నారని, అయినా వారికి కూడా ఇవ్వలేదని తెలిపారు. ఇంకొందరికి మీటర్లు ఇచ్చి తిరిగి వెనక్కి తీసుకెళ్లడం వంటి ఆధారాలతో సహా కోర్టులో కేసు వేశామని వివరించారు. విద్యుత్ అధికారుల చుట్టూ బాధితులు కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతోనే కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు.

రోగులకు పండ్లు పంపిణీ...



చంద్రగిరి : సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చారు. కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు రమేష్‌రెడ్డి, శివకోటిరెడ్డి, గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, కొండూరు ప్రవీణ్ రాయల్, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, వినోద్, పులికంటి మోహన్‌రెడ్డి, ఉమాపతిరెడ్డి, ధనంజయరెడ్డి, లంకెల్ల లలిత, నాగరాజనాయుడు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. శానంబట్ల గ్రామంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అత్తూరు తులసేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నాగయ్యగారిపల్లెలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. వాసునాయుడు, మేఘవర్ణంనాయుడు, రజినినాయుడు, జనార్దన్‌నాయుడు పాల్గొన్నారు. నారావారిపల్లెలో చంద్రబాబు ఇంటిముందు గ్రామస్తులు, టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. సర్పంచ్ లక్ష్మి, నిరంజన్‌నాయుడు, నారా సుబ్రమణ్యంనాయుడు, హేమాద్రినాయుడు, మునిరత్నంనాయుడు, వల్లూరి శ్రీకాంత్‌చౌదరి, నారా విజయ్ పాల్గొన్నారు.

ఉగాది పురస్కార జర్నలిస్టులకు సత్కారం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం అందుకున్న సీనియర్ జర్నలిస్టులు షైనాస్వామి, పురుషోత్తంనాయుడను తిరుపతి ప్రెస్‌క్లబ్ కమిటీ ఘనంగా సత్కరించింది. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి ఉగాది పురస్కార గ్రహీతలకు అభినందన సభ నిర్వహించారు.



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్‌లో పీజీటీ ఇంగ్లిష్ టీచర్‌గా ఉద్యోగ విరమణ పొందిన విజయకుమారి దంపతులను సన్మానిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవుల నాయుడు, సిబ్బంది



ఎస్వీయూ సెనేట్ హాల్లో జరిగిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో ఆయన మిత్రులు, సన్నిహితులను సన్మానించిన నిర్వాహకులు

అప్పట్లో.. చంద్రబాబుతో..!

- చిన్ననాటి.. చదువుకునే రోజుల్లో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మిత్రులు
- ఎస్వీయూలో ఘనంగా జన్మదిన వేడుకలు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుతో చిన్ననాటి జ్ఞాపకాలనూ, విద్యార్థి దశలో ఆయన చురుకుదనాన్నీ, కాలేజీలో, యూనివర్శిటీలో ఆయన నాయకత్వ లక్షణాలనూ చంద్రబాబు 75వ పుట్టినరోజు సందర్భంగా పలువురు గుర్తు చేసుకున్నారు. ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాల్లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన సభలో చంద్రబాబు చిన్ననాటి స్నేహితులు, ఆయనతో కలిసి చదువుకున్నవారు అనేకులు భావోద్వేగంతో తమ అనుబంధాన్ని పంచుకున్నారు. వారి మాటల్లోనే ఆ విశేషాలు..

చిన్న నాడే శ్రమదానం

శేషాపురంలో చంద్రబాబుతో కలిసి చదువుకున్నా. చిన్నప్పుడే శ్రమదానం చేశారు. తోటి వారితోనూ చేయించారు. జ్ఞాపకశక్తి అపారం. ఇప్పటికీ చిన్ననాటి స్నేహితులందరినీ పేరు పెట్టి పిలుస్తారు.

- బొబ్బా దత్తాత్రేయుడు

చదువుకుంటూనే సేద్యం చేసేవారు

చదువుకునేటప్పుడే చంద్రబాబు చాలా చురుగ్గా ఉండేవారు. చదువుకుంటూనే వ్యవసాయ పనులు చేసేవారు. మేమిద్దరం ఎస్వీయూలో చదువుకున్నాం.ప్రపంచం మెచ్చిన నేతగా ఆయన ఎదగడం గర్వంగా అనిపిస్తోంది.

- చంద్రశేఖర నాయుడు, శేషాపురం

పట్టుదల ఎక్కువ

పట్టుదల, సహనానికి చంద్రబాబు మారు పేరు. 1968లో టికెట్ లేకుండా మేం రైలు ప్రయాణాలు చేసిన తీపి జ్ఞాపకాలు ఉన్నాయి. హాస్టల్‌లో పేకాటలో వచ్చిన డబ్బుతో పేద విద్యార్థుల పరీక్ష ఫీజు కట్టేవారు. పీజీలో ఉన్నపుడే యూత్ కాంగ్రెస్ లీడర్ అయ్యారు.

- కొత్తపల్లె దేవరాజులు నాయుడు, కందులవారిపల్లె

బాబు వల్లే రాజకీయాల్లోకి వచ్చా

నన్ను ప్రత్యక్ష రాజకీయాల్లోకి తెచ్చి ఎమ్మెల్యే కావడానికి కారణం చంద్రబాబే. చంద్రబాబులోని నాయకత్వ లక్షణాలను ఈ తరం యువత ఆదర్శంగా తీసుకోవాలి.

- రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే

ఎమ్మెల్సీగా పోటీ చేయాల్సి ఉండగా..

1973లో ఎంఏ ఎకనమిక్స్‌లో చంద్రబాబు చేరారు. 1977లో ఎమ్మెల్సీగా పోటీ చేయాల్సి ఉండగా, కొన్ని కారణాలతో తర్వాత ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ప్రస్తుతం దేశం గర్వించదగ్గ నాయకుడుగా ఎదిగిన బాబుతో కలిసి నడవటం గర్వకారణం.

- ప్రొఫెసర్ పెమ్మసాని దేవసేన నాయుడు, పీజీలో చంద్రబాబుకు జూనియర్

ఓటర్లకు ఉత్తరాలు రాసే వాళ్ళం

1978లో ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ఓటర్లకు ఉత్తరాలు రాసే వాళ్లం. హెరిటేజ్ ప్రారంభించినప్పుడు పదిహేను పేజీల చేతి రాత ప్రణాళికను చూసి ఆశ్చర్యం వేసింది. యువతకు బాబు స్ఫూర్తి.

- బీఎన్ నాగేశ్వరరావు, బాబుకు సహ విద్యార్థి

కష్టాన్ని నమ్ముకున్న వ్యక్తి

1977లో నేను ఎక్కువగా గొడవలు పడేవాడిని. మందలించి మంచీ చెడులు చెప్పేవారు. కష్టాన్నీ దైవాన్నీ నమ్ముకున్న వ్యక్తి చంద్రబాబు.

- చిల్లంగి రమణ, స్నేహితుడు

ఎదుటి వారిని గౌరవించే స్వభావం

ముఖ్యమైన మీటింగ్‌లో ఉన్నా, నేను కనిపిస్తే మాట్లాడేవారు. సీఎం అయ్యాక, కలిసి భుజం మీద చెయ్యి వేసి పలకరించారు. ఎంత ఎదిగినా ఎదుటి వారిని గౌరవించే స్వభావం చంద్రబాబుది.

- రాధాకృష్ణ, సహ విద్యార్థి

తన మన బేధం లేదు

చంద్రబాబుకు తన మన బేధం లేదు. అందరికీ సరైన న్యాయం చేసే వ్యక్తి. స్టూడెంట్ స్టేజ్‌ను బాబు బాగా అనుభవించారు.

- ఆనంద నాయుడు, సి.మల్లవరం

ఎస్సీ, బీసీల ఆదరణ ఎక్కువ

1978లో కమ్మ, రెడ్డి వర్గాలు బాబుకు ఓటు వేయలేదు.ఎస్సీ, బీసీలు గెలిపించారు.దీనిని బట్టి బాబుకు ఎస్సీబీసీ వర్గాల ఆదరణ ఎక్కువ.

- సుబ్బరామిరెడ్డి, స్నేహితుడు, శేషాపురం

ఆలోచనా విధానమే ఆయనకు బలం

చంద్రబాబు ఆలోచనా విధానమే ఆయనకు బలం. రాజధాని నిర్మాణానికి సైతం రైతులు ముందుకొచ్చి, భూములు స్వచ్ఛందంగా ఇస్తున్నారంటే బాబు పట్ల ప్రజలకున్న నమ్మకం ఏ పాటిదో ఆలోచించవచ్చు.

- రామనాథం నాయుడు, స్నేహితుడు

యవతను సమీకరించడంలో ఘనుడు

యువతను ఆర్గనైజ్ చేయడంలో చంద్రబాబు చురుకుగా ఉండేవారు. తమ హక్కుల కోసం పోరాటం చేసినా, యూనివర్సిటీ ఆస్తులకు ఎప్పుడూ నష్టం చేయలేదు.

- ప్రొఫెసర్ మురళి, మాజీ వీసీ

గ్లోబల్ లీడర్

ఎస్వీయూ విద్యార్థి చంద్రబాబు గ్లోబల్ లీడర్ కావడం గొప్ప విషయం. పీ-4 విధానం ద్వారా 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తున్నారు.

- ప్రొఫెసర్ అప్పారావు, వీసీ

రాజకీయ వ్యతిరేకత గ్రామాల్లోనూ సమస్యల పరిష్కారం

రాజకీయంగా వ్యతిరేకత కలిగిన గ్రామాల్లోనూ పర్యటించి సమస్యలు పరిష్కరించిన గొప్పదనం చంద్రబాబుది. ప్రతి అంశం మీద సమగ్ర అవగాహన పెంచుకునేవారు. యూనివర్సిటీ ఎన్నికల్లో క్రమశిక్షణ కలిగిన వారినే ఎంపిక చేశారు.

- పీవీ రవికుమార్, సీనియర్ జర్నలిస్టు

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ఇండియన్ ఎకనమిక్ అసోసియేషన్ సదస్సులో ఏటా చంద్రబాబు పేరుతో ఉపన్యాసం ఉంటుంది. తనకు హాని చేసిన వారినీ పట్టించుకోని నైజం ఆయనది. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని ప్రజలూ నమ్మారు.

- ప్రొఫెసర్ మునిరత్నం నాయుడు

ఎస్వీయూ విద్యార్థి కావడం గర్వకారణం

చంద్రబాబు నాయుడు ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థి కావడం గర్వకారణం. ఎంతో దూరదృష్టి కలిగిన నాయకుడు. 2047లో ఏపీ అభివృద్ధి సమగ్రం అవుతుంది.

- ప్రొఫెసర్ భూపతి నాయుడు, రిజిస్ట్రార్

ఏపీ బ్రాండ్ సీఎం చంద్రబాబు

మన రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబే. ఆయన్ను చూసి చాలా కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నాయి. వీటితో యువతకు ఉపాధి కలుగుతుంది.

- మోహన్, మాజీ ఎమ్మెల్యే

కష్టాలను అధిగమించి ఈ స్థాయికొచ్చారు

జీవితంలో ఎన్నో కష్ట నష్టాలను అధిగమించి చంద్రబాబు ఈ స్థాయికి వచ్చారు. రాష్ట్రం కోసం ఆయన పడుతున్న తపన త్వరలో ఫలిస్తుంది. సామాన్యుల కనీస అవసరాలను తీర్చాలనే ఆలోచనతో బాబు శ్రమిస్తున్నారు.

- రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే



చంద్రబాబు పేరిట ఒకరోజు అన్నదానం

ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదినం సందర్భంగా తిరుమలలో అన్నదానసత్రంలో భక్తులతో కలిసి భోజనం చేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి. భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ ఒక రోజు అన్నదానానికి రూ. 44లక్షలు అందజేశారు.





ఉదయమాణిక్యంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నానీ - పాకాలలో వేడుకలు జరుపుకుంటున్న టీడీపీ శ్రేణులు

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో మండలంలోని ఉదయమాణిక్యం పంచాయతీ శివాలయం వద్ద సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మండల కేంద్రంలో పార్టీ సెక్టోరియల్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, కార్యదర్శి మహేష్ నాయుడు, మహిళా అధ్యక్షురాలు కొమ్మాక లక్ష్మీదేవి, బీసీ నాయకురాలు దేవి, రజక కార్పొరేషన్ డైరెక్టర్ మధు, తలకోన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ సోమనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాకాల : మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అన్నదానం చేశారు. టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు ఆంజనేయస్వామి ఆలయంలో టీడీపీ నేతలు చంద్రబాబు పేరుపై అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేయించారు. కేక్ కట్ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, ప్రధాన కార్యదర్శి మదన మోహన, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, వైస్ ఎంపీపీ సునీత దామోదరం, ఎంపీటీసీ విజయకుమారి, ఆర్వీ రమణా రెడ్డి, మోహన్ రెడ్డి, ముత్తం ప్రభాకర్, బెల్లంకొండ రమణ, చంద్రశేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



చిన్నగొట్టిగల్లులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు



రామచంద్రాపురం : మండల కేంద్రంలో ఆదివారం టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, జనార్దన చౌదరి, నరసింహారెడ్డి, హరిప్రసాద్, లీలామోహన్, మునిరామిరెడ్డి, మునెయ్య, విక్కి చౌదరి, సురేంద్రనాయుడు, మహేష్‌నాయుడు పాల్గొన్నారు.

అక్షయక్షేత్రంలో అన్నదానం



తిరుపతిరూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): దుర్గసముద్రంలోని అక్షయక్షేత్రంలో ప్రత్యేక ప్రతిభావంతులతో కలసి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిశేఖర్ నేతృత్వంలో కేక్ కట్ చేశారు. అన్నదానం నిర్వహించారు. నాయకులు బాబురాయల్, మౌనిక, రవి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటమునిరెడ్డి, చంగయ్యయాదవ్, ఓసీరాయల్, సురేంద్రరెడ్డి, సుధాకర్, శంకర్, బాబు, రామయ్య పాల్గొన్నారు.

తిరుచానూరు : రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలు చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ తిరుపతి రూరల్ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు.



కేక్ కట్ చేస్తున్న నేతలు

టీటీడీ పరిపాలన భవనంలో అగ్నిప్రమాదం

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. భవనంలోని సీసీ కెమెరాల మానిటరింగ్ గదిలో ఉన్న ఏసీకి వెళ్లే వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో ప్రమాదం సంభవించింది. వెంటనే గుర్తించిన టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. తిరుపతి వీజీవో, ఇతర అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టారు.

వృద్ధాశ్రమానికి వీల్‌చైర్ల వితరణ



వీల్‌చైర్లు, కుక్కర్ వితరణ చేస్తున్న ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఆదివారం 35వ డివిజన్‌లోని ఆదరణ వృద్ధాశ్రమానికి వీల్‌చైర్లు, కమోడ్ ప్రెజర్ కుక్కర్, ఇతర వస్తువులు అందించారు. వృద్ధుల చేత కేక్ కట్ చేయించి, అన్నదానం చేశారు. టీడీపీ నేతలు మబ్బు దేవనారాయణ, నాగభూషణం, ఎస్వీఎం శ్రీధర్, జగ్గా రవితేజ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, మైనం సురేష్, చంద్రారెడ్డి, సుజాతమ్మ, సుబ్బు యాదవ్, నాగ ప్రతాప్ పాల్గొన్నారు.

క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణస్వీకారం



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న దృశ్యం

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆముదాల ప్రభాకర్, కార్యదర్శిగా పరదాల మణి, పలువురు కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ నాయకులు నవీన్‌కుమార్ రెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, వ్యాపార సంస్థల ప్రతినిధులు హాజరై వారిని అభినందించారు. తనపై నమ్మకంత పదవి కట్టబెట్టిన కమిటీ సభ్యులకు ఆముదాల ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఏఐబీఈఏ వ్యవస్థాపక దినోత్సవం

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏఐబీఈఏ(ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్) 80వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీసీ ఏరియాలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో భారీ కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. పాస్ మనోవికాస్ కేంద్రంలోని పిల్లలకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. నాయకులు జె.ధన్వంతకుమార్, విజయభాస్కర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఓం సుపథం' ఆస్పత్రి ప్రారంభం



డాక్టర్ విఠల్‌మోహన్‌తో కలిసి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ప్రముఖులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు అత్యాధునిక వైద్య పరికరాలతో నాణ్యమైన వైద్య సేవలను అందించే విధంగా ఓం సుపథం ఆస్పత్రి విశిష్ట సేవలు అందిస్తోందని ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక భవానీనగర్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఓం సుపథం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని వారు ఆదివారం ప్రారంభించారు. చిన్నారులకు 20 ఏళ్లుగా విశిష్టమైన వైద్య సేవలు అందిస్తూ నేడు మల్టీ స్పెషాలిటీ సేవలను అందించే విధంగా ఓం సుపథం ఆస్పత్రి ప్రారంభమవడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఆస్పత్రి ఎండీ డాక్టర్ విఠల్‌మోహన్‌తో కలిసి వారు ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, వన్నెకుల క్షత్రియ సంఘం చైర్మన్ సీఆర్ రాజన్, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, డాక్టర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత హోమం



హోమంలో పాల్గొన్న ఆనంద్‌గౌడ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా తెలుగు యువత ఆధ్వర్యంలో గణపతి హోమం, ఆయుష్హ హోమం నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎల్ఎస్ నగర్ శివాలయంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అయురారోగ్యాలతో వెలుగొందాలని కోరుకున్నారు. ఈ హోమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సూరా సుధాకర్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణారెడ్డి, టీవీ మురళీనాథరెడ్డి, పెరుమాళ్ మధు, హరి, అశోక్, నాగేంద్ర, 22వ డివిజన్ అధ్యక్షుడు బాల పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో కారు దగ్ధం
కోనసీమ భక్తులు సురక్షితం



తిరుమల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో ఆదివారం ఓ కారు దగ్ధమైంది. అదృష్టవశాత్తు కారులోని ఐదుగురు భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. కోనసీమ జిల్లా రావులపాలెంకు చెందిన ఉపేంద్ర వెంకట్‌రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉదయం తిరుమలకు డస్టర్ కారులో బయలుదేరారు. భాష్యగార్ల సన్నిధి ప్రాంతానికి రాగానే కారు ఇంజన్ నుంచి పొగలు రావడాన్ని గుర్తించారు. వాహనాన్ని పక్కనే ఆపి కిందకు దిగేశారు. నిమిషాల వ్యవధిలోనే మంటలు వ్యాపించి కారు కాలిపోయింది. టీటీడీ విజిలెన్స్, ఫైర్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనతో గంటన్నర పాటు ఘాట్‌లో వాహనాలు నిలిచిపోయాయి. తిరుమలకు వచ్చే డస్టర్ కారుల్లో మంటలు రావడం ఇది మూడో సంఘటన. షార్ట్‌సర్క్యూట్‌తోనే అగ్నిప్రమాదాలు జరుగుతున్నట్టు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీలో అన్నదానం

తిరుపతి(ఆర్టీసీ) : సీఎం జన్మదినం సందర్భంగా ఆర్టీసీ తిరుపతి డిపో గ్యారేజీ ముందు ఏపీపీటీడీ కార్మిక పరిషత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రజారవాణాధికారి జి.నరసింహులు ప్రారంభించారు. భారీ కేక్ కట్ చేశారు. ఏపీపీటీడీ కార్మిక పరిషత్ జిల్లా అధ్యక్షుడు వి.సుదర్శన రావు, కార్యదర్శి గార్లపాటి రవి, డిపో అధ్యక్షుడు కె.ఎం.రత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వి.ఎస్.మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తాతయ్యనగర్‌లో చోరీ

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాతయ్యనగర్‌లో ఆదివారం చోరీ జరిగింది. దొంగలు ఆరు సవరాల బంగారు చైను, రూ.50వేల నగదు అపహరించుకెళ్లారు. తాతయ్యనగర్‌లో నివాసముంటున్న రెడ్డెమ్మ తిరుమలలో హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. శనివారం రాత్రి డ్యూటీ నిమిత్తం తిరుమలకు వెళ్లింది. ఆదివారం ఉదయం రాగా ఇంటి ముందున్న సీసీ కెమెరాలు పగులకొట్టి ఉన్నాయి. తలుపులు కూడా తీసి ఉండడంతో లోనికెళ్లి చూడగా ఆరు సవరాల బంగారు చైను, రూ.50వేల నగదు కనిపించలేదు. ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

వాడవాడలా టీడీపీ శ్రేణుల సంబరాలు

తిరుపతి, ఏప్రిల్20, ఆంధ్రజ్యోతి : టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు ఆదివారం తిరుపతిలో ఘనంగా జరిగాయి. నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున సంబరాలు నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. నిరాశ్రయులకు పలు వస్తువులను వితరణ చేశారు. ప్రతి డివిజన్‌లోనూ పార్టీ శ్రేణులు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. చంద్రబాబు ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు చేశారు. టౌన్‌క్లబ్ సర్కిల్ వద్ద కేక్ కట్ చేసి, అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు తినిపించారు.

● **పలు డివిజన్లలో..**

పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య కూటమి నాయకులతో కలసి 34వ డివిజన్లో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఎన్డీఏ నాయకులు తిరుమల కేశవులు, గుండాల గోపినాథ్, సురేష్ కుమార్, తిరుత్తణి వేణుగోపాల్, గుత్తా నాగరాజు, నైనార్ జగదీష్, హనుమంతరావు, సూర్యప్రకాష్, సురేంద్రరాజు పాల్గొన్నారు. 36వ డివిజన్లో పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్‌చేశారు. కూటమి నాయకులు చిత్తూరు రవిశంకర్ యాదవ్, ఆవుల శంకర్ యాదవ్, వినోద్ రాయల్, ఆముదాల వెంకటేష్, శేషాద్రి, కృష్ణ యాదవ్, శ్రీనివాస యాదవ్, గౌస్‌భాష, యాసిన్ భాష, ముని రాయల్, వియలు పాల్గొన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఆముదాల తులసీరాం, 36వ డివిజన్ జనసేన అధ్యక్షుడు వినోద్ రాయల్, బుజ్జి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు.



పోలీసుకు కేక్ తినిపిస్తున్న సుగుణమ్మ

● **టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..**

టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్, నగర అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మార్‌పల్లిలోని అన్న క్యాంటీన్ వద్ద భారీ కేక్ కట్‌చేసి, పెద్దఎత్తున అన్నదానం చేపట్టారు. నాయకులు సుగుణమ్మ, నరసింహ యాదవ్, రవినాయుడు పాల్గొన్నారు.

అలిపిరిలో పూజలు



అలిపిరిలో టెంకాయలు కొడుతున్న టీడీపీ నేతలు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అలిపిరిలో టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేయించారు. శాప్ చైర్మన్ రవి నాయుడు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు శ్రీవారి పాదాల చెంత టెంకాయలు కొట్టి, పాదాల మండపంలో, గోశాలలో సీఎం పేరిట పూజలు చేయించారు. మహేష్ యాదవ్, విజయ్‌కుమార్, దంపూరి భాస్కర్ యాదవ్, హేమంత్ రాయల్ పాల్గొన్నారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రత్యేక పూజలు చేయించారు.

తెలుగు యువత ఆధ్వర్యాన అన్నదానం



అన్నదానం చేస్తున్న రజనీకాంత్ నాయుడు, టీడీపీ నేతలు

తిరుపతి అర్బన్ : సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్‌నాయుడు ఆదివారం 75 కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలో వెయ్యిమందికి అన్నదానం చేశారు. టీడీపీ సీనియర్ నేతలు పులుగోరు మురళీకృష్ణారెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, ఆర్సీ మునికృష్ణ, సురా సుధాకర్‌రెడ్డి, చినబాబు, ఈతమాకుల హేమంత్‌యాదవ్, దొడ్డారెడ్డి ప్రకాశ్, గాలి పవన్‌చౌదరి, జలపోతు చంద్ర, ఉప్పలపాటి సాయి చౌదరి, జనసేన నాయకులు నెలవాయి మురళీకృష్ణ పాల్గొన్నారు.

జీవకోనలో..



వేడుకల్లో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కుమారమ్మ తదితరులు

తిరుపతి(జీవకోన) : నగర పరిధిలోని జీవకోన రాజీవ్‌గాంధీ కాలనీ పార్టీ కార్యాలయం వద్ద ఎస్సీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కుమారమ్మ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాణి, మురళి, వంశీ, లలిత, శ్యామల, మరియమ్మ, ప్రభు తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద గల ప్రముఖ ఆస్పత్రిలో టీడీపీ నేత, తిరుపతి కోఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రోగులకు, వృద్ధులకు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

'శ్రవణం' చిన్నారుల మధ్య చంద్రబాబు జన్మదిన వేడుకలు



శ్రవణంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి) : టీటీడీ శ్రవణం (చెవిటి, మూగ) కేంద్రంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం బధిర విద్యార్థుల నడుమ సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. 75 కేజీల కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మునికృష్ణ మాట్లాడుతూ వినికిడి లోపమున్న పిల్లల సమక్షంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. వీరికి ఎటువంటి సహాయం కావాలన్న అందుబాటులోకి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, ఊకా విజయకుమార్, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, పాటకం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

14వ డివిజన్‌లో కేక్ కట్ చేసి..



సీఎం చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని 14వ డివిజన్ టీడీపీ సీనియర్ నేత మేడికొండ శ్రీహరి నాయుడు కేక్ కట్ చేశారు. అదే సమయంలో ఒక పేద మహిళ అక్కడికి చేరుకుని తనకు పింఛన్ రాలేదని చెప్పడంతో అధికారులతో మాట్లాడతానని భరోసా ఇచ్చారు. ఆమెకు 25 కేజీల బియ్యం బస్తా అందజేశారు. ఈ వేడుకల్లో డివిజన్ అధ్యక్షుడు రవి, యశ్వంత్, మణి, యశోద, లక్ష్మి, వల్లెమ్మ, ఉదయ్, పాల్గొన్నారు.

4న నాయీ బ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మే 4వ తేదీన నాయీబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు నాయీబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక అన్నారావు కూడలి పట్టాకాంప్లెక్స్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు.

అశ్వమేధ విద్యార్థుల జయకేతనం



మంచి ఫలితాలు సాధించిన అశ్వమేధ విద్యార్థులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లోని అశ్వమేధ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి పర్సంటైల్ మార్కులు పొంది విజయకేతనం ఎగురవేశారని డైరెక్టర్లు అబ్దుల్ ఇష్రత్, టీఎం గోవర్ధన్ పేర్కొన్నారు. వివిధ కేటగిరిల్లో ప్రతిభచాటిన విద్యార్థుల వివరాలను వెల్లడించారు. పి.నిఖిల్ 243 ర్యాంకు, కె.యషశ్రీ 3,089, ఎం.మోనిష 3,110, వి.సిద్ధార్థ 4,113, సీవీ రేవంత్ 4,600, జి.వెంకట్‌రెడ్డి 6,624 ర్యాంకులు సాధించారన్నారు. 40 మంది విద్యార్థులకుగాను 18మందికిపైగా అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. ప్రిన్సిపాల్స్ సుమతి, రామయ్య, అధ్యాపకులు అభినందించారు.

జేఈఈలో శ్రీచైతన్య విద్యార్థుల విజయ ప్రభంజనం



ఉత్తమ ర్యాంకులు పొందిన శ్రీచైతన్య విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జేఈఈ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ మార్కులు సాధించి విజయ ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల తిరుపతి జోన్ ఏజీఎం బీవీ ప్రసాద్ చెప్పారు. కృష్ణవంశీ 331 ర్యాంకు, జశ్వంతి 458, ద్వారక్ 723, సూర్య 818, బీపీ రెడ్డి 1000, అన్విత్ 1,214, మునికృష్ణ 1,329, సహస్ర 1,742, మంజునాథ మహర్షి 5,001, నిశిలేశ్వర్‌రెడ్డి 5,268, హర్షిణి బ్రైటీ 5,361, ఉజ్వల్ సాయిరెడ్డి 5,527 వంటి ఉత్తమ ర్యాంకులు సాధించారని వెల్లడించారు. 26 మంది 10 వేలలోపు, 46 మంది 20వేల లోపు ర్యాంకులు సాధించగా సుమారు 85 మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక జాతీయ విద్యాసంస్థల్లో ఎన్ఐటీ, ఐఐఐటీలో సీట్లు సాధించగలిగే ర్యాంకులు సాధించారని వివరించారు. విద్యార్థులను బీవీ ప్రసాద్‌తో పాటు డీన్‌లు కేవీల్టీ ప్రసాద్, రామమోహనరావు, శ్రీనివాసరాజు అభినందించారు.

అమరావతి విద్యార్థుల విజయ దరహాసం



అమరావతి ఐఐటీ, జేఈఈ అకాడమీ విద్యార్థులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని అమరావతి ఐఐటీ, జేఈఈ అకాడమీ (బీవీకే జూనియర్ కళాశాల) విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ మార్కులతో సత్తా చాటారని చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అరుణ్‌కుమార్‌రెడ్డి 82 ర్యాంకు, కేయుష్‌సాయి 1,072, వంశీకృష్ణ 1,748, సాయి సంతోష్ 3,172, మనీష్ 3,852, సాయి నికిత 4,233, లకితాహసిని 4,467, లక్ష్మీ మాధురి 5,192, రుతిక్ 5,453, మానస్ కుమార్ 5,569, నీరజ్ 5,811, కార్తీక్ సాయితేజ 5,887, ఈశ్వర్‌రెడ్డి 6,144, లాస్య 6,291, విజయరామిరెడ్డి 7,247, రోహన్ తేజ 9,615 ర్యాంకులు సాధించారన్నారు. 2500 లోపు ముగ్గురు, 5వేల లోపు ఏడుగురు, 10వేల లోపు 16 మంది, 20 వేలలోపు 60 మంది మంచి ర్యాంకులు సాధించారని, 75 మందికి పైగా విద్యార్థులు 95 పర్సంటైల్‌కు పైగా మార్కులు పొందారన్నారు. వైస్ చైర్మన్ పార్థివ్ రెడ్డి, డైరెక్టర్ అరుణ, అధ్యాపకులు అభినందించారు.

నారాయణ విద్యార్థుల జయకేతనం



నారాయణ విద్యార్థులతో డీజీఎం కొండలరావు తదితర అధ్యాపకులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నారాయణ విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్ మార్కులు సాధించి జయకేతనం ఎగురవేశారని డీజీఎం కొండలరావు పేర్కొన్నారు. భానుచరణ్‌రెడ్డి 158, మణిదీప్‌రెడ్డి 274, నిఖిల్ 386, ధనుష్ 466, హిమేష్ రామచంద్ర 502, కార్తీక్‌శ్రీ 1,072, యశ్విత 1,035, బాలాజీ సాయిచరణ్ 1,654, గగనాధిత్యరెడ్డి 2,126 వంటి ర్యాంకులతోపాటు 1000 లోపు ఆరుగురు, 2000 వేలలోపు 8, 5వేలలోపు 14, 10వేల లోపు 24 మంది విద్యార్థులు ఓపెన్ కేటగిరీలో ర్యాంకులు సాధించారని తెలిపారు. కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు విజయ్‌కుమార్, అభిషేక్, చిట్టిబాబు, దుర్గాప్రసాద్, ఏజీఎం గోపిచంద్ అభినందించారు.

సత్తాచాటిన శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ ఐఐటీ-జేఈఈ, నీట్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ మార్కులతో సత్తాచాటారని చైర్మన్ మద్దినేని శ్రీధర్ పేర్కొన్నారు. ఎస్.వంశీకృష్ణారెడ్డి 98 ర్యాంకు, ఎం.మహేష్ 298, టి.హరజిత్ 1,477, టి.నిఖిలేశ్వర్‌రెడ్డి 4,260, ఇ.మంజుశ్రీ 6,103, పి.మహ్మద్ అబుతాలిబ్ 7,843, ఎస్.మహ్మద్ ఇమ్రాన్ 8,240, డి.పోషిత 15,891 వంటి ర్యాంకులను సాధించారని తెలిపారు. 108మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరవగా 42మంది అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించి విజయకేతనం ఎగురవేశారని తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ సీఈవో వాణిశ్రీ, అధ్యాపకులు అభినందించారు.



బస్టాండ్‌లో ఊడిపడిన శ్లాబ్ పెచ్చులు
ప్రయాణికులకు తృటిలో తప్పిన ప్రమాదం



ఊడిపడిన శ్లాబ్ పెచ్చులు - బయటకు కనిపిస్తున్న ఇనుప ఊచలు

నాయుడుపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం శ్లాబ్ పెచ్చులు ఊడి పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బస్టాండ్ శిథిలా వస్థకు చేరుకుని శ్లాబ్ ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. తరచూ శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతోంది. గతంలో శ్లాబ్ పెచ్చులూడి పడి ప్రయాణికులు గాయాలయ్యాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ శ్లాబ్‌కు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

కనులపండువగా సీతారాముల కల్యాణం



తాళిబొట్టును చూపుతున్న వేదపండితుడు

చిల్లకూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరులో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజలు జరిపి స్థానికుల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ సీతారాముల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం బాణసంచా పేలుళ్లు, కోలాటాల నడుమ సీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు.

సైనికుల్లా పని చేయాలి



చిట్టేడులో జనసేన జెండాఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

కోట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త రెట్టింపు ఉత్సాహంతో పార్టీ ప్రతిష్ఠత కోసం సైనికుల్లా పనిచేయాలని జనసేన నాయకుడు కొణిదల మునిగిరీష్ కోరారు. మండలంలోని చిట్టేడు ఆర్టీసీ సెంటర్‌లో ఆదివారం జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని పలు మండలాల నాయకుల సమక్షంలో పార్టీ జెండాను ఆవిష్కరించి లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రశేఖర్, చంద్రనీల్, ఇంద్రనీల్, అల్లం బాబు, అనిల్, హరీష్, శశి, మణి, పరంధామ్, కోట, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్కి భూములను స్వాధీనం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న హేతువాద సంఘ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, పక్కన రాజు, వెంకటరమణ తదితరులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కల్కి భగవాన్ ఆశ్రమం ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని భారత హేతువాద సంఘ అధ్యక్షుడు నార్ని వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం సూళ్లూరుపేటలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లా డారు. వరదయ్యపాలెం వద్ద ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూముల్లో కల్కి ఆశ్రమాలు నిర్మించారని, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బీఎన్ కండ్రిగ మండలం కల్లిపెట్టు గ్రామం వద్ద సర్వే నెంబరు 295లో దాదాపు 21 ఎకరాలు అటవీభూమి ఆక్రమించి భవనాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు. అటవీ భూములను కాపాడాలన్నారు. కార్యక్రమంలో హేతువాద సంఘ నాయకులు రాజు, వెంకటరమణ, మునిచంద్రయ్య, రాము, పోలయ్య పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



టీడీపీలో చేరిన వారితో మంత్రి ఆనం, ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల

నాయుడుపేట, నాయుడుపేట టౌన్ ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటకు చెందిన మాజీ సర్పంచు గోనిపల్లి గురుమూర్తి, కోట్లపూడి రాజేష్‌తో పాటు మరో వంద మంది వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నాయుడుపేట మండలంలోని పుదూరు మినీ ఫంక్షన్ హాల్లో ఆదివారం రాత్రి జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు మంత్రి ఆనం పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, సీనియర్ నాయకులు విజయభాస్కరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, మధురెడ్డి, ఆకుతోట రమేష్, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, రమేష్ నాయుడు, చంద్రారెడ్డి, దార్ల రాజేంద్ర, విజయకుమార్ నాయుడు, సంచి కృష్ణయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు

గూడూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మునిగిరీష్ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యుడు మునిగిరీష్, వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, పవన్‌కుమార్, రాధయ్య, శ్రీనివాసాచారి, జనా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజా వీధిలో ఉన్న ఆర్వీఎం ఉన్నత పాఠశాల వద్ద మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు.

ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు



గూడూరు కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, ఆహార పొట్లాలను అందజేశారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, శ్రీదేవి, నరసింహులు, వెంకటేశ్వర్లురెడ్డి, తీగల సురేష్‌బాబు, జనార్దనరెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని రైల్వేగేటు వద్దనున్న టీడీపీ కార్యాల యంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే కేక్‌కట్ చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేసి అన్నదానం చేశారు. అదే విధంగా ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, చిట్టేటి పెరుమాల్, మునిరాజా, అశోక్‌రెడ్డి, విజయమ్మ, బుజ్జయ్య, బీజేపీ నేతలు ఆదినారాయణరెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని కొత్తూరు టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మ ణ్యం కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. పేదలకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. అదేవిధంగా పెళ్లకూరులో పేరం రమేష్ నాయుడు, మధునాయుడు, వేలూరు మురళీ కృష్ణారెడ్డి, శిరసనంబేడులో వేలూరు కల్యాణ్‌రెడ్డి, బంగారంపేటలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, జీలపాటూరులో ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు జరిగాయి. పేదలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ కొండల్‌రావు, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు మదన్‌మోహన్ నాయుడు, సిద్దులయ్య నాయుడు, నరేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని రాణీపేటలో ఉన్న బాలల సదన్‌లో చిన్నారుల నడుమ టీడీపీ నేత గంగోటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. చిన్నారుల చేత కేక్ కట్ చేయించారు. అన్నదానం చేశారు. అంతకుముందు గ్రామశక్తి పోలేరమ్మ దేవస్థానం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజ, బీరం రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాథ నాయుడు, చంద్రమౌళిరెడ్డి గొల్లగుంట వెంకటముని, నరసింహులు, జీకేపల్లి బాబు నాయుడు, ఆవుల ప్రహలాద, మురళి, నాగరాజు పాల్గొన్నారు.

తడ: మండల కేంద్రంలోని బజారు కూడలిలో టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి ఆధ్వర్యంలో, వాటంబేడుకుప్పం గ్రామంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, కారూరులో మత్స్యకార నాయకులు సుందరమూర్తి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. కార్యక్ర మాల్లో నీలకంఠం, సెల్వం, ఫణి, రవి, సుధాకర్, ఏకాంబ్రం, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్య క్షుడు దువ్వూరు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, పవిత్రారెడ్డి, పాదర్తి ప్రకాశ్‌నాయుడు, ఎద్దల సుధాకర్‌రెడ్డి, షేక్ రఫీ, శంకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద సీఎం చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ 75 కేజీల కేక్‌ను కట్ చేశారు. అనంతరం మహిళలకు చీర, జాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తడ జట్పీటీసీ ఇందుమతి, వైసీపీ నాయకులు గోపాల్ రత్నం మణి, రాజా, తదితరులు ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజక ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దార్ల రాజేంద్ర, అవధానం సుధీర్, నానాబాల సుబ్బారావు, బీవీఆర్ నాయుడు, రాజేష్, గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరిలోని బాలల సదన్‌లో చిన్నారుల చేత కేక్ కట్ చేయిస్తున్న టీడీపీ నాయకులు



పెళ్లకూరు మండలంలోని కొత్తూరులో చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

చిల్లకూరు: స్థానిక డానియేల్ చిల్డ్రన్స్ హోమ్‌లో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్‌చేశారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు వెంకటేష్, దినేష్‌వర్మ, జగదీష్, సుమంత్, జవీన్‌కుమార్, ప్రశాంత్, సతీష్, ధనుష్ పాల్గొన్నారు.

బాలాయపల్లి: స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్ర మంలో దాసరి రాజగోపాల్ నాయుడు, రాయి సత్యం నాయుడు, కొత్రపాటి రామచంద్ర నాయుడు, తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, ముప్పాళ్ల గురువేంద్ర, శివ, వేళ్ల సురేంద్ర రెడ్డి, మాదవనాయుడు, సాగి నరసింహులు నాయుడు, మారెళ్ల వెంకటాద్రి, జనార్దనరెడ్డి, దాసరి కోటేశ్వరావు, మురళి పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని ఆర్టీసీ సెంటర్‌లో సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్ స్టాండు వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మధుయాదవ్, పోలయ్య, వాకా విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, మస్తాన్‌బాషా, తూపిలి రాధాకృష్ణారెడ్డి, కోటేశ్వరరావు, కోటారెడ్డి, దారా సురేష్, షంషుద్దీన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: స్థానిక టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. శ్రీనివాసులునాయుడు, శ్రీహరిరెడ్డి, షబ్బీర్, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

వాకాడు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను టీడీపీ మండల అధ్యక్షులు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి సన్నారెడ్డి విజయ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కృష్ణమూర్తి, శ్రీనివాసులురెడ్డి, ప్రమీల, శ్రీనివాసులు, ద్వారకనాథ రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భువనేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం



కల్యాణోత్సవంలో పార్వతి పరమేశ్వర్లు

తడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బోడిలింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేకం వేడుకలు ఆదివారం ముగిశాయి. శుక్రవారం మొదలైన ఈ కార్యక్రమాలను ఆదివారం సాయంత్రం పార్వతి, పరమేశ్వరుల కల్యాణంతో ముగించారు. ముందుగా తెల్లవారుజామున గణపతి పూజ, ధన్వంతరి హోమం, మృత్యుంజయ హోమం, మహాపూర్ణాహుతి, శిఖరమహాకుంభాభిషేకం, చతుర్వేద పారాయణం నిర్వహించారు. అనంతరం కలశ జలాలతో ఆలయ శిఖర కలిశాలను అభిషేకించి మహాకుంభాభిషేం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి



సామాజిక ఆరోగ్య కేంద్రంలో బీజేపీ నాయకులు

నాయుడుపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సామా జిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం బీజేపీ నాయకులు సందర్శించారు. ఆస్పత్రిలో బ్లడ్ స్టోరేజ్, డయాలసిస్ యూనిట్, వాటర్ ప్లాంట్, కరెంటు సౌకర్యం, ప్రహరీ తదితర సమస్యలను ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంగినేని కృష్ణయ్య, అమరావతి రామయ్య, విజయ భాస్కర్, ఆశ చెంచుకృష్ణయ్య, కొప్పోలు సుబ్రమణ్యం, చిగురాకుల సురేంద్ర, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థికి చేయూత

నాయుడుపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నాయుడుపేటకు చెందిన గాయత్రి తిరుపతిలోని పద్మావతి మహిళా కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఆమె తల్లిదండ్రులు నిరుపేదలు కావడంతో విద్యాభ్యాసం కోసం ఎమ్మెల్యే విజయశ్రీ రూ.25 వేలు అందజేశారు.

మాస్టర్స్ తైక్వాండో క్లబ్ ప్రారంభం



తైక్వాండో క్రీడాకారులతో మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ

నాయుడుపేట టౌన్ ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట బేరిపేటలో మాస్టర్స్ తైక్వాండో క్లబ్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ ఆదివారం ప్రారంభించారు. చిన్నారులకు ఉచితంగా తైక్వాండో శిక్షణ ఇచ్చి వారి స్వీయ రక్షణకు తోడ్పడుతున్న మాస్టర్స్ తైక్వాండో క్లబ్ వ్యవస్థాపకుడు ఉయ్యాల పవన్ కుమారన్‌ను అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోచ్ వినోద్ కుమార్, అబ్రాత్, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు

కోట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకారంలో ఉంచారు. కోట, వాకాడు, చిట్ట మూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పాలక మండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బాలిక ఆత్మహత్య

చిల్లకూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) మండలంలోని బూదనం గ్రామానికి చెందిన మహాలక్ష్మి(16) ఉరివేసుకుని ఆత్మహత్య చేసు కుంది. పోలీసుల వివరాల మేరకు... మహాలక్ష్మిని ఆమె స్నేహితురాలి కుటుంబ సభ్యులు తమ బిడ్డను చెడగొడుతున్నావని మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన మహాలక్ష్మి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈస్టర్ ప్రార్థనలు

ఓజిలి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఓజిలిలోని సెయింట్ జాన్స్ చర్చిలో పాస్టర్ రాజారత్నం ఆధ్వర్యంలో ఈస్టర్ ప్రార్థనలు జరిగాయి. అదేవిధంగా కురుగొండ, వెంకటరెడ్డిపాళెం, కుందాం, అత్తివరం, ఆరిమేనిపాడు, చిల్లమానుచేను, పెద్దపరియ తదితర గ్రామాల్లోని చర్చిల్లో కూడా ప్రార్థనలు నిర్వహించారు.

గూడూరు: ఈస్టర్ డే సందర్భంగా పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా స్థానిక ప్రార్థనా మందిరం, హోసన్న మందిరం చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు.

కోట: మండలంలోని అల్లంపాడు, కోట, విద్యానగర్, గూడలి, తిన్నెలపూడి గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను జరుపుకున్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్‌వో రమణయ్య

నాయుడుపేట టౌన్ ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రమణయ్య అన్నారు. ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. వంట గదుల్లో గాలి, వెలుతురు బాగా ఉండేలా చూసుకోవాలన్నారు. వంట గ్యాస్ లీకైనట్టు అనుమానం వస్తే ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్ చేయకూడదని, రెగ్యులేటర్‌ను తక్షణమే ఆపేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్ఎంలు చంద్రబాబు, రామకృష్ణ, సందీప్, నాగరాజు, రవీంద్రరెడ్డి, పోలయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఇళ్లలో అగ్నిప్రమాదాలు జరిగినపుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అగ్ని మాపక అధికారి హరీష్, నరసింహం, వెంకటసుబ్బయ్య, శ్రీహరి, దుర్గాప్రసాద్, సునీల్, నాగరాజు, వినయ్, దేశయ్య పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్ధనరెడ్డి, దశరథరామిరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, మధుసూదనరెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల అందజేత

గూడూరు అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు ఆహార పొట్లాలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్, రవి కుమార్, శ్రీనివాసులు, సురేంద్రబాబు, కరిముల్లా పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

గూడూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం జైన్ సంఘం ఆధ్వర్యంలో చెన్నై మెట్రో మహవీర్ క్లబ్ సహకారంతో తిరుపతికి చెందిన ఎస్వీ ఆరవింద కంటి ఆస్పత్రి వైద్యులచే ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. పేదలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు, కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మిచంద్, అరుణ్ నహర్, రమేష్ కుమార్, సతీష్, జ్ఞాన్‌చంద్, సుభాష్‌చంద్, అజిత్, బొమ్మిడి శ్రీని వాసులు, అశోక్ కుమార్, అభిషేక్ కుమార్ పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

వాహనం ఢీకొని తమిళనాడువాసికి గాయాలు

తడ ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. తమిళనాడు పల్వరుకాడుకు చెందిన చంద్రశేఖర్ ఆది వారం సూళ్లూరుపేటలో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు బైక్‌పై బయలు దేరాడు. తడ బోడిలింగాలపాడు వద్దకు గుర్తుతెలియని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌కు కాలు విరిగి గాయాలయ్యాయి. 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తీసుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

టిడ్కో ఇళ్ల వద్ద కార్డన్ సెర్చ్



వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న సీఐ రమణ

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న టిడ్కో ఇళ్ల వద్ద ఆదివారం సీఐ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 11 మోటర్ సైకిళ్లు, 5 ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయట ప్రాంతాలకు వెళ్లే వారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే సమా చారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు సుబ్బారావు, శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటపోలూరులో...

సూళ్లూరుపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ చెంచుబాబు అన్నారు. మండల పరిధిలోని కోటపోలూరు ఈస్ట్ హరిజనవాడలో ఆదివారం సీఐ మురళీకృష్ణ, ఎస్ఐలు పోలీసు సిబ్బందితో కలిసి డీఎస్పీ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 180 ఇళ్లలో తనిఖీలు నిర్వహించి వాహనాలకు సంబంధించిన వాహనాలను పరిశీ లించారు. రికార్డులు సక్రమంగా లేని నాలుగు వాహనాలను సీజ్ చేశారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో తడ, సూళ్లూరుపేట, శ్రీహరి కోట ఎస్ఐలు కొండప నాయుడు, వేటూరి బ్రహ్మనాయుడు, శ్రీకాంత్, ఏఎస్ఐ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పులికాట్‌ను సందర్శించిన కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి



పులికాట్‌ను పరిశీలిస్తున్న రీనా నగర్, పక్కన డీఎఫ్‌వో హారిక తదితరులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి రీనా నగర్ ఆదివారం ఫారెస్టు అధికారులతో కలిసి పులికాట్ సరస్సును సందర్శించారు. ఆమెకు తిరుపతి అటవీశాఖ ముఖ్య అధికారి సి.శెల్వం, సూళ్లూరురుపేట డీఎఫ్‌వో ఈ.హారిక పులికాట్ సరస్సుకు వలస వచ్చే పక్షులు, సరస్సు ప్రాముఖ్యం గురించి వివరించారు. అనంతరం అట్టకానితిప్పలోని పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని రీనా నగర్ సందర్శించారు.

దుకాణాల్లో తనిఖీలు

వాకాడు,ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) వాకాడు మండ లంలో తూనికలు, కొలతులు శాఖ ఇన్స్‌పెక్టర్ మల్లీశ్వర్ ఆధ్వర్యంలో ఆశాఖ అధికారులు ఆదివారం దాడులు నిర్వహిం చారు. అధిక ధరలకు విక్రయిం చడం, తూకంలో తేడాలు ఉండడం, కాలం చెల్లిన తినుబండారాలను తనిఖీ చేశారు. కొన్ని దుకాణాల్లో తూకాల్లో తేడాలు ఉండడంతో కేసులు నమోదు చేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శ నానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో అన్ని కంపార్టుమెంట్లతో పాటు నారాయణ గిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీసీ వరకు వ్యాపించింది. క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.36 కోట్లు లభించింది.

స్క్రూడ్రైవర్‌తో మామను పొడిచిన అల్లుడు

భార్యపై దాడి ● అడ్డుకోబోయిన పెద్దమామకు తెచ్చిన తంటా




గాయపడిన సుబ్రహ్మణ్యం - చికిత్స పొందుతున్న మునీశ్వరి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యపై భర్త దాడికి దిగాడు. పొరిగింట్లో ఉండే పెద్ద మామ... దంపతుల మధ్య గొడవను సర్ది చెప్పే ప్రయత్నం చేశాడు. సహనం కోల్పోయిన అల్లుడు స్క్రూడ్రైవర్‌తో ఆయన్ను పొడిచాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం నారాయణపురంలో ఆదివారం రాత్రి 9గంటల ప్రాంతంలో జరిగింది. బాధితుల కథనం మేరకు... నారాయణపురానికి చెందిన సుబ్రహ్మణ్యం(70) రైతు. ఈయన తమ్ముడు కృష్ణయ్య కూడా రైతు. వీరిద్దరు పక్కపక్క ఇళ్లలో ఉంటారు. కృష్ణయ్య కుమార్తె మునీశ్వరికి ఇదే గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ గోపీతో కొద్ది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మద్యం మత్తులో గోపి తరచూ భార్యతో గొడవ పడేవాడు. పలుమార్లు పెద్దలు పంచాయితీ చేసి దంపతులను ఒక్కటి చేశారు. ఆదివారం గోపి గొడవ పడడంతో మునీశ్వరి మనస్తాపం చెంది తండ్రి కృష్ణయ్య ఇంటికి వచ్చింది. కాసేపటి తరువాత గోపి మామ ఇంటికి చేరుకున్నాడు. భార్యతో వాగ్వాదం ముదరడంతో దాడికి దిగాడు. పక్కింట్లో ఉండే పెద్దమామ సుబ్రహ్మణ్యం సర్ది చెప్పేందుకు అక్కడికి వెళ్లాడు. దీంతో ఆగ్రహించిన గోపి పెద్దమామ సుబ్రహ్మణ్యంను స్క్రూడ్రైవర్‌తో పొడచి పరారయ్యాడు. స్థానికులు సుబ్రహ్మణ్యంను, మునీశ్వరిని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కడుపులోకి స్క్రూడ్రైవర్ బలంగా గుచ్చుకోవడంతో సుబ్రహ్మణ్యంను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. కాగా ఈ యేడాది ఫిబ్రవరిలో ఇదే తరహాలో గోపి సొంతమామ కృష్ణయ్యపై కూడా స్క్రూడ్రైవర్‌తో దాడి చేసినట్లు వాపోయాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు విచారిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

రేణిగుంట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈస్టర్‌ను క్రైసవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆదివారం పట్టణంలోని అన్ని చర్చిల్లో క్రీస్తు పునరుత్థానమైన దినాన్ని ఘనంగా జరుపుకున్నారు. అలాగే ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బుచ్చినాయుడుకండ్రిగ చర్చిలో పాస్టర్ జాన్‌వెస్లీ ప్రసంగిస్తూ ఏసుక్రీస్తు మానవుల పాపములకై శుక్రవారం నాడు శిలువ వేయబడి ఆదివారం నాడు తిరిగి లేచాడని తెలిపారు. ఈ సందర్భంగా తమ పితృదేవతల సమాధులను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో చివరిరోజు ఆదివారం ఆర్టీసీ గ్యారేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్, గ్యాస్, షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంఎఫ్ కల్యాణచక్రవర్తి, ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి నాగార్జునరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు(ఆంధ్రజ్యోతి): అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎన్‌ఆర్ అగ్రహారంలోని అగ్నిమాపక శాఖ కేంద్రంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి అగ్ని ప్రమాదాలు - నివారణలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నక్క హరిజనవాడకు చెందిన దళిత నాయకుడు వి.ఉమాపతి ఇటీవల మృతి చెందాడు. ఆదివారం ఉమాపతి ఇంటికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు శంకర్, షేక్ సిరాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మహాకుంభాభిషేకానికి విరాళం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం పెద్దకనపర్తిలో గణపతి ఆలయ మహాకుంభాభిషేకానికి విచ్చేయాలని గ్రామస్తులు ఆదివారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుతను కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె రూ.10వేలు విరాళంగా అందజేశారు. తప్పకుండా వస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేననాయకులు తదితరులు పాల్గొన్నారు.

జైన దీక్ష ఉత్సవం

● సన్యాసం స్వీకరణకు సిద్ధమైన శ్రీకాళహస్తి యువతి




శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తికి చెందిన రాను, సునీల్‌జైన్ దంపతుల కుమార్తె కషిష్‌జైన్ సన్యాసం స్వీకరణకు సిద్ధమయ్యారు. ఆధ్యాత్మిక మార్గంలో పయనించేందుకు ఆమె ముందుకురాగా, కుటుంబ పెద్దలు అంగీకరించి మత పెద్దల సహకారంతో ప్రోత్సహించారు. మే 3వ తేదీన నాసిక్‌లో జైన్ ఆచార్యులు, మత పెద్దల సమక్షంలో సన్యాస స్వీకరణ జరగనుంది. ముందస్తుగా శ్రీకాళహస్తిలో జైన్ సంఘం ఆధ్వర్యంలో జైన్ దీక్ష మహోత్సవం వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జైన్ భవనం నుంచి పురవీధుల్లో ఊరేగింపు సాగింది. పానగల్ వద్ద అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా కషిష్ జైన్‌ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సత్కరించారు. పలువురు అభినందించారు. జైన్ సంఘం అధ్యక్షుడు ధ్యాన్‌చంద్, కార్యదర్శి సునీల్ జైన్, టీడీపీఈ నేతలు విజయ్ కుమార్, చెంచునాయుడు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బొజ్జల బృందమ్మ, టీడీపీ నాయకులు

అభివృద్ధి ప్రదాతకు జన్మదిన శుభాకాంక్షలు





ముక్కంటి ఆలయంలో మహిళా సెక్యూరిటీ, స్వీపర్లకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే - గాలి మురళినాయుడికి కేక్ తినిపిస్తున్న రావిళ్ల మునిరాజానాయుడు - మోదుగులపాళెంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సుధీర్ పాల్గొని సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేదల గుండెల్లో సీఎం చంద్రబాబు స్థానం సంపాదించారని తెలిపారు. పోలవరం నిర్మాణం పరుగులు పెడుతోం దన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, చెంచయ్యనాయుడు, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద పేదలకు అన్నదానం చేశారు. అనంతరం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో చంద్రబాబు పేరిట పూజలు చేయించారు. మహిళా సెక్యూరిటీ, స్వీపర్లకు తల్లి బృందమ్మతో కలిసి చీరలు పంపిణీ చేశారు. తిరుపతి పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షుడు సుబ్బయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లు అందజేశారు. చెన్నైరోడ్డులోని బాలికల వసతి గృహంలో ఆర్వోప్లాంట్‌ను ప్రారంభించారు. గాలిగోపురం సమీపంలో మాజీ కౌన్సిలర్ మునికృష్ణ ఆధ్వర్యంలో, బీసీసెల్ పట్టణాధ్యక్షుడు పోలూరు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ నివేదిత మోరె, ఉమేష్‌రావు, రాంబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు తన స్వగృహంలో భారీ కేక్ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

● తొట్టంబేడు మండలంలో పార్టీ మండల అధ్యక్షుడు గాలి మురళీనాయుడు ఆధ్వర్యంలో సింగమాలలో కొలువై ఉన్న వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రావిళ్ల మునిరాజా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● సీఎం చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని టీడీపీ తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు తక్కలపాటి ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో హిందూపురం నియోజకవర్గంలోని లేపాక్షి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వ రాలయంలోని మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతినాయుడు, దశరథాచారి తదిత రులు పాల్గొన్నారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంక్షేమ సారథి, సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే ఆదిమూలం ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం మండలంలోని దుండి వినాయకస్వామి ఆలయంలో చంద్రబాబె పేరిట ఎమ్మెల్యే ఆదిమూలం, జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ అర్చనలు, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మెగా డీఎస్సీ, జాబ్ మేళాలు, ప్రజలకు సంక్షేమ పథకాల అమలు సీఎం చంద్రన్నకే సాధ్యమని కొనియాడారు. మాజీ ఎంపీపీ భక్తవత్సలం, గోవిందస్వామి, మాజీ సర్పంచ్ కే.ఎస్. రవి, కోనేటి బాబు, గాండ్ల గోవిందశెట్టి, మాణిక్యం రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

● నారాయణవనం మండల టీడీపీ అధ్యక్షుడు గిరిబాబు ఆధ్వర్యంలో సింగిరికోన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌లో మాజీ ఎమ్మెల్యే హేమలత ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అన్నదానం చేశారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను సత్యవేడులో కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీపతి బాబు, పార్టీ అబ్జర్వర్ చంద్రశేఖర్ నాయుడు కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. మాజీ ఎంపీపీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. క్లాక్ టవర్ వద్ద , ఆర్టీసీ బస్టాండ్, పీవీపురంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు కొండూరు బాలరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండలంలో సీఎం చంద్రబాబు 75 జన్మదిన వేడుకలను టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా బస్టాండు ఆవరణంలో ఉన్న సిద్ధులయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అన్నదానం చేశారు. నంద కిషోర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భారతమ్మ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆరెలో తిరుపతి పార్లమెంట్ టీఎన్‌టీయూసీ నాయకుడు జయరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే ఆదిమూలం హాజరయ్యారు. కేవీబీపురంలోని సాయిబాబా ఆలయం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మునస్వామియాదవ్, మాజీ ఎంపీపీ మణి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీహరి యాదవ్, ఎస్‌ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగాయి. స్టేట్ బ్యాంకు దగ్గర టీడీపీ జిల్లా కార్యదర్శి రవినాయుడు, బి.రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కన్నయ్య నాయుడు, నాయకులు సుధాకరనాయుడు, మధునాయుడు, మునెయ్యనాయుడు, మునిచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● ఏర్పేడు మండలం మోదుగులపాళెంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేర్లపూడి మణి, పేరం ధనంజయలునాయుడు, కందాటి శంకర్‌రెడ్డి, మోహన్‌నాయుడు, పొన్నారావు, రెడ్డివారి గురవారెడ్డి, నాగరాజునాయుడు, నిరంజన్‌బాబు, గాలి కృష్ణవేణి, గౌరమ్మ, మస్తాన్, సుబ్రహ్మణ్యం, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం కరకంబాడిలోని టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జి బుజ్జినాయుడు ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు.అనంతరం అన్నదానం చేశారు. అలాగే పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కట్టపుట్టాలమ్మ ఆలయ పాలకమండలి ఛైర్మన్ పాడి రాజేంద్ర, బాలాజి, ముని కుమార్ తదితరుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని 75 కిలోల భారీ కేక్‌ను ఎమ్మెల్యే ఆదిమూలం కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం అన్నదానం చేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పద్దురాజు, జయచంద్రనాయుడు, సుమాంజలి, వాసురెడ్డి, మణికంఠ, ఎం.ఎస్.రవి, బుజ్జినాయుడు, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.





లేపాక్షిలో టీడీపీ నాయకుడు ప్రకాష్‌నాయుడు తదితరులు - నారాయణవనంలో ఆదిమూలం ఆధ్వర్యంలో అన్నదానం - వరదయ్యపాళెంలో సీఎం జన్మదిన వేడుకలు

సిమెంటు రోడ్డు ప్రారంభం



సత్యవేడు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజగోపాలపురంలో రూ.5 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీపతి బాబు, పార్టీ పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో అన్ని కంపార్టుమెంట్లతో పాటు నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీసీ వరకు వ్యాపించింది.

దారి కాచి కర్రలతో దాడి



చికిత్స పొందుతున్న శేషు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): దారి కాచి కొందరు దుండగులు యువకుడిపై కర్రలతో దాడి చేశారు. ఈ ఘటన తొట్టంబేడు మండలం గాజులకండ్రిగ వద్ద శనివారం రాత్రి జరిగింది. బాధితుడి కథనం మేరకు... తొట్టంబేడు మండలం బోనుపల్లికి చెందిన శేషు(34) ఇదే మండలంలోని చియ్యవరంలో ఉన్న మద్యం దుకాణంలో క్యాషియర్. శనివారం రాత్రి మద్యం దుకాణం మూసిన తరువాత ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా రాజులకండ్రిగ కొందరు దుండగులు శేషును అడ్డగించారు. ఎక్కడ పనిచేస్తావని ఆరా తీశారు. మద్యం దుకాణంలో పని చేస్తున్నానని చెప్పడంతో కర్రలతో దాడి చేసి పరారయ్యారు. అటుగా వెళ్తున్న ఓ కూల్‌డ్రింక్ షాపు నిర్వాహకుడు రోడ్డు పక్కన గాయాలతో పడి ఉన్న శేషును చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తొట్టంబేడు పోలీసులు ఈ ఘటనపై విచారణ చేస్తున్నారు.

తమ్ముడిపై ...



గాయపడిన శేషాద్రి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మాటామాటా పెరగడంతో తమ్ముడిపై అన్న కర్రతో దాడి చేశాడు. ఈ ఘటన ఆదివారం ఉదయం తొట్టంబేడు మండలం శివనాథపాళెం వద్ద జరిగింది. బాధితుడి కథనం మేరకు శివనాథపాళెంకు చెందిన శేషాద్రి ప్రైవేటు పనులు చేస్తుంటాడు. ఇంటి వద్ద మద్యం మత్తులో ఉన్న అన్నతో వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన అన్న కర్రతో దాడి చేశాడు. గాయపడిన శేషాద్రి చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరాడు.

గుంతలు పూడ్చండి సారూ...



కర్నాల వీధిలో గుంత

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చండి సారూ అంటూ కర్నాల వీధివాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. శ్రీకాళహస్తి పట్టణం నడిబొడ్డున చతుర్మాడ వీధుల్లో కర్నాల వీధి ఉంది. ముక్కంటి ఆలయ సమీపం బజారువీధిలో నుంచి కర్నాల వీధిలోకి వెళ్లే సందులో రెండు గుంతలు ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు అదుపు తప్పి గాయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

పుత్తూరు వార్తలు

శివ..శివా.. పాలకమండలి ఎప్పుడయ్యా?

● 1నుంచి సదా శివేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు
● రాష్ట్రప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు గడుస్తున్నా కాలయాపన!



పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పురాతన ఆలయాల్లో ఒకటైన కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయ పాలకమండలి నియామకంలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు గడుస్తున్నా పాలకమండలి ఊసేలేదు. గత పాలకమండలి నిర్ణయాలు నేటికీ కొనసాగుతుండడంతో ఆలయ ఆదాయానికి గండి పడుతోంది. ఆలయానికి చెందిన దుకాణాల అద్దె వసూళ్లే ఇందుకు నిదర్శనం. రూ.కోట్ల ఆలయ ఆస్తులు కోర్టు వివాదంలో ఉన్నాయి. ఈ క్రమంలో మే 1వ తేదీ నుంచి సదాశివేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈక్రమంలో పాలకమండలి ఛైర్మన్, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆలయ అర్చకుడు సహా తొమ్మిదిమంది సభ్యుల పేర్లను ఖరారు చేసి దేవదాయశాఖకు ప్రతిపాదంచినట్లు సమాచారం. నెల రోజులు గడుస్తున్నా ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. మరో పది రోజుల్లో వార్షిక బ్రహ్మోత్సవాలు ఉండగా పాలకమండలి నియామకానికి ఉత్తర్వులు వెలువడతాయా అన్న అనుమానాలున్నాయి. ఏది ఏమైనా పాలకమండలి నియామకంతోనే ఆలయ నిర్వహణ, వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా జరిగే అవకాశం ఉంటుందని పట్టణప్రజలు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందే పాలకమండలి నియామకం జరుగుతుందని అధికార పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని కృష్ణసముద్రంలో జరిగింది. ఆదివారం వేకువజాము 4.30 గంటల సమయంలో చిన్నపాటి మంటలకు ఇంట్లో ఉన్నవారు అప్రమత్తం కావడంతో ప్రాణాలతో భయటపడ్డారు. సుకన్య తన ఇద్దరు పిల్లలతో కృష్ణసముద్రంలో రేకుల ఇంట్లో నివసిస్తోంది. పుత్తూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తూ పిల్లలకు చదివించుకుంటోంది. ఇటీవల కుటుంబ అవసరాల కోసం పొలం అమ్మి రూ.1.50 లక్షల నగదును ఇంట్లోనే భద్రపరిచింది. ఇంతలో షార్ట్‌సర్క్యూట్ రూపంలో ఆ నగదుతో పాటు 7 సవర్ల బంగారం, దుస్తులు, వంట సామాగ్రి, గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. కాగా మంటలు చెలరేగగానే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చే లోగా ఇల్లు పూర్తిగా కాలిపోయింది.

పుత్తూరు(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన బాధితురాలు సుకన్యను మాజీ మంత్రి రోజా పరామర్శించారు. నిత్యావసర వస్తువులు, పదివేల రూపాయలను అందించారు. ఎంపీపీ మునివేలు, సర్పంచ్ శ్యామ్, ఎంపీటీసీ సభ్యుడు ప్రభు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదినం



కార్యకర్తకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే భాను

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్ర జ్యోతి): సీఎం చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం అన్నదానం చేశారు. ● సీఎం జన్మదిన వేడుకల ఎంబీరోడ్డులోని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు కార్యాలయంలో ఘనంగా నిర్వహిం చారు. పార్టీ మాజీ మండల అధ్యక్షుడు విజయ్ శేఖర్ నాయుడు కేక్ కట్ చేశారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాలు ముగిశాయి.ఈ సందర్భంగా స్థానిక ఫైర్ స్టేషన్‌లో అగ్ని ప్రమాదాల సమయంలో రక్షించే విధానం, చేపట్టే చర్యలు, అధునాతన అగ్నిమాపక పరికరాల పనితీరును ఫైర్ సిబ్బంది వివరించారు. ఫైర్ ఆఫీసర్ నేతాజీ, సిబ్బంది శివయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి దాతృత్వం

వడమాలపేట, 20 ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలలో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతూనే దుస్తులు, విద్యా సామగ్రిని ఉపాధ్యాయుడు పి.నాగరాజు అందజేశారు. మండలంలోని సీతారామపురం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రెండు జతల దుస్తులు, విద్యాసామగ్రి వితరణ చేశారు. టీడీపీ నాయకులు గోపాల్ నాయుడు, మోహన్‌నాయుడు, సుబ్రహ్మణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.